క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన డీసీసీ అధ్యక్షుడు



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్ డి.కె.బాలాజీని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొల్లు కృష్ణ మంగళవారం మినీకాన్ఫరెన్స్ హాలులో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఎస్పీ ఆర్.గంగాధరరావును కూడా కలిశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ మతీన్, వెలిశల సుబ్రహ్మణ్యం, కోకా ఫణిభూషణ్ పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూలుకు బీరువాల బహూకరణ

నాగాయలంక: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ కార్యాలయానికి వరంగల్ రీజనల్ ఇంజినీరింగ్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ సబ్బినేని వెంకటేశ్వరరావు రెండు ఇనుప బీరువాలను మంగళవారం బహూకరించారు. రూ.30 వేల విలువైన బీరువాలను తన మేనల్లుడు తలశిల శివాజీ చేతుల మీదుగా హెచ్ఎం పి.వి.ఎస్.వి.ప్రసాద్‌కు అందజేశారు.

ముగిసిన క్రీడాపోటీలు

మోపిదేవి: మండల స్థాయిలో రెండు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఈఓ-1 దుర్గాసాగర్ మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించిన విద్యార్థులు చాలా ఉల్లాసంగా ఉంటారని, చదువులో కూడా చురుకుదనం ఉంటుందన్నారు. అనంతరం వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు, గురుకుల పాఠశాల ప్రిన్సి పాల్ కె.వీరరవి, ఎంఈఓ-2 పిచ్చయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడి పర్యటన



గణపేశ్వరం(నాగాయలంక): బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదులో భాగంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబు గణపేశ్వరం, బర్రంకుల దీనదయాళపురం గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. 70 సభ్యత్వాలను నమోదు చేసినట్లు పార్టీ మండల అధ్యక్షుడు కన్నా వెంకటేశ్వరరావు(నాని) తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఒకరిద్దరు నాయకులు మినహా అందరూ కమలం గుర్తు కలిగిన పసుపు రంగు కండువాలను ధరించడం చర్చనీయాంశంగా మారింది.

బ్యాంక్ ఉద్యోగుల నిరసన



మచిలీపట్నంటౌన్: దీర్ఘకాలంగా తాము ఎదుర్కొంటున్న అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు మంగళవారం స్థానిక రీజనల్ ఆఫీస్ వద్ద నిరసన చేపట్టారు. ఈ నెల రెండో తేదీన సెంట్రల్ ఆఫీస్‌లో మేనేజ్‌మెంట్‌కు యూనియన్ 20 డిమాండ్లతో ఇచ్చిన వినతిపై స్పందించకపోవటంతో ఈ నిరసన చేస్తున్నామని ఉద్యోగులు పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీన దేశవ్యాప్త సమ్మె చేస్తామని తెలిపారు. రీజనల్ సెక్రటరీలు, ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస్, ఎంప్లాయీస్ అసోసియేషన్ రీజ నల్ సెక్రటరీలు డి.రాజేష్‌బాబు, బి.యోహాన్, యూనియన్ నాయకులు వై.దుర్గారావు, డి.సలాం, వాణి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పుస్తక సమీక్షకులుగా గోగినేనిపాలెం విద్యార్థులు

గోగినేనిపాలెం(ఘంటసాల): ఉత్తమ పుస్తక సమీక్షకులుగా తమ విద్యార్థులు ఎంపికవడం గర్వకారణమని గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం తమ్మన వేణుగోపాలరావు పేర్కొన్నారు. హైదరాబాదుకు చెందిన బేసిక్ రీసెర్చ్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ (బ్రెడ్) చిల్డ్రన్ లైబ్రరీ నుంచి ఉత్తమ పుస్తక సమీక్షల కోసం ఘంటసాల మండలం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో ఇటీవల ఎంపిక పరీక్షలు నిర్వహించారు. ఆయా పరీక్షల్లో హైస్కూల్‌కు చెందిన కోనేరు వల్లీకుమారి, యార్లగడ్డ రాజేష్, ఈపూరి లిప్సిక, కుంపటి ఆకాష్ ఉత్తమ పుస్తక సమీక్షకులుగా ఎంపికవగా బ్రెడ్ సొసైటీ పంపిన ప్రశంసా పత్రాలను హెచ్ఎం వేణుగోపాలరావు ఉపాధ్యాయులతో కలసి విద్యార్థులకు మంగళవారం అందించారు. ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ కుంపటి సుశీల, ఉప సర్పంచ్ గణపనేని వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్పర్సన్ కుంపటి జీవన్ కుమార్ అభినందించారు.

డీఎస్పీ అబ్దుల్ సుభాన్ బదిలీ

చిలకలపూడి (మచిలీపట్నం): మచిలీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ ఎండీ అబ్దుల్ సుభాన్ బదిలీ అయ్యారు. సీఐడీ డీఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. విజయవాడ సీఎస్‌బీ డీఎస్పీ కె.వి.వి.ఎస్.వి.ప్రసాద్‌ను నూజివీడు డీఎస్పీగా బదిలీ చేస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వరిలో చీడపీడల నివారణ కీలకం



కృత్తివెన్నులో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు, రైతులు

మెరకనపల్లి(మోపిదేవి): వరి పైరును ఆశించే చీడ పురుగులు, తెగుళ్ల నివారణకు రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని కేవీకే ఘంటసాల వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కె.రేవతి సూచించారు. మండలంలోని వెంకటాపురం, మెరకనపల్లి, అన్నవరంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి సాగులో రైతులకు పలు సూచనలు చేశారు. పైరును కాండం తొలుచు పురుగు, ఆకు ముడత పురుగు ఆశించినట్లు గుర్తించామని, వీటి నివారణకు ఎకరాకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 60 మిల్లీలీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సుడిదోమ, పాముపొడ, కంకినల్లి నివారణపై అవగాహన కలిగించారు. మండల వ్యవసాయాధికారి హెప్సిబా రాణి, పలువురు ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో నాణ్యమైన ఉత్పత్తులు

కృత్తివెన్ను: సేంద్రియ ఎరువుల వాడకం వల్ల నాణ్యమైన ఆహార ఉత్పత్తులను సాధించుకోవచ్చని వ్యవసాయశాఖ ఏడీఏ గౌతమ్ సూచించారు. కృత్తివెన్ను, సీతనపల్లి గ్రామపంచాయతీల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. రైతులకు వ్యవసాయంలో పలు సూచనలు, సలహాలు అందించారు. కృత్తివెన్ను వ్యవసాయశాఖాధికారి ఎస్.జెన్నీ, ఫిషరీస్ వీఎఫ్ఏ చక్రవర్తి పాల్గొన్నారు.

అధిక ఎరువులతో నేలకు చేటు

గూడూరు: మోతాదుకు మించిన ఎరువులు, పురుగు మందులతో పంట భూమిని పాడుచేసుకోవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.పద్మావతి రైతులకు సూచించారు. మండలంలోని తరకటూరులో పొలం మంగళవారం 'పిలుస్తోంది కార్యక్రమం' జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పద్మావతి మాట్లాడుతూ.. వరిసాగులో రైతులు పాటించాల్సిన మెలకువలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకుని సేంద్రియ దిగుబడులు పెంచాలని కోరారు. గూడూరు మండల వ్యవసాయ శాఖ అధికారి జి.శివప్రసాద్, రైతులు కమ్మిల రమణ, తోట వినయ్ పాల్గొన్నారు.

ఘంటసాల మండలంలో..

ఘంటసాల: మండలంలోని శ్రీకాకుళం, అచ్చెంపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ శాఖాధికారి కె.మురళీకృష్ణ ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు రైతులతో కలసి పొలాలను పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో జరిగిన సమావేశంలో మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించేందుకే పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ బి.విజయప్రసాద్, అచ్చెంపాలెం సర్పంచ్ గాజుల శ్రీనివాసరావు, ఘంటసాల ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ పద్మావతి, ఈఓలు జి.శ్రీనివాసరావు, ఆర్.శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ అధికారి బి.రాంబాబు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు త్వరలో పరిహారం

బంటుమిల్లి: ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు త్వరలో ప్రభుత్వం పరిహారం మంజూరు చేస్తుందని వ్యవసాయశాఖాధికారి జి.శివరామకృష్ణ తెలిపారు. మండలంలోని నాగేశ్వరరావుపేట, ములపర్రు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి స్ఫూర్తి పాడి పశువుల పోషణలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఓ.చిన్నారి బాబు, సర్పంచ్ తాతా మహాలక్ష్మి, ఏఎంసీ సూపర్‌వైజర్ కాజాబాబు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి



మెరకనపల్లిలో మందు పిచికారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



శ్రీకాకుళం పొలం పిలుస్తోంది సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్యామల

డీటీలకు ఘనంగా వీడ్కోలు

పెడన: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు డెప్యూటీ తహసీల్దార్లు, ఒక సీనియర్ అసిస్టెంట్ మంగళవారం రిలీవయ్యారు. వారికి మండలంలోని వీఆర్వోలు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఇన్‌చార్జి తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న డెప్యూటీ తహసీల్దారు కె.పూర్ణచంద్రరావు, రీ సర్వే డీటీ పి.సత్యనారాయణ, ఎన్నికల విభాగం డీటీ కల్పనతో పాటు సీనియర్ అసిస్టెంట్ శ్యామ్‌కుమార్‌ను వీడ్కోలు సభలో ఘనంగా సత్కరించారు. బదిలీపై పెనమలూరు నుంచి పెడనకు డెప్యూటీ తహసీల్దారుగా కె.అనిల్‌కుమార్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన్ని కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మణికుమార్, వీఆర్వోల సంఘ నాయకుడు గోవిందరాజులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని చాటుదాం

పెడన: ఎటువంటి అల్లర్లు లేకుండా అంతా కలసి ఐక్యంగా ఉండి మత సామరస్యాన్ని చాటుదామని మచిలీపట్నం సీసీఎస్ డీఎస్పీ, సిట్ బృందం ఇన్‌చార్జి సుభాష్ అన్నారు. పెడన మార్కెట్ యార్డు ఆవరణలో పీస్ కమిటీ సమావేశం మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీన రెండు వర్గాల మధ్య జరిగిన ఘటనలో పలువురు నిందితులను గుర్తించామన్నారు. ఇరు పక్షాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. భవిష్యత్తులో ఎటు వంటి అల్లర్లు జరగకుండా ఇరువర్గాల వారు మత సామరస్యంతో మెలగాలని సూచించారు. ఈ సమావేశంలో మచిలీపట్నం ఆర్డీఓ ఎం.వాణి, బందరు డీఎస్పీ అబ్దుల్‌సుభానీ, సీఐలు మోజెస్, నాగేంద్రప్రసాదు, ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అనీల్‌కుమార్, కమిషనర్ గోపాలరావు, ఇరు వర్గాలకు చెందిన పెద్దలు పాల్గొన్నారు.

అధికారులపై బంటుమిల్లి ఎంపీపీ ఆగ్రహం



బంటుమిల్లి మండల సర్వసభ్య సమావేశంలో నివేదిక ఇస్తున్న ఎలక్ట్రికల్ ఏఈ రవికుమార్

బంటుమిల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి సమయపాలన పాటించక హాజరైన, గైర్హాజరైన అధికారులపై ఎంపీపీ వి.చినబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం ఎమ్మెల్యే పర్యటన నేపథ్యంలో కోరం లేక వాయిదా పడింది. ఎంపీపీ అధ్యక్షతన సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి పలు ప్రభుత్వ శాఖల అధికారులు సమయపాలన పాటించకుండా అప్పుడొకరు అప్పుడొకరుగా హాజరయ్యారు. బదిలీల పేరుతో మరి కొందరు గైర్హాజరయ్యారు. వారిపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ ఏఈ నగేష్ నివేదిక సమర్పిస్తుండగా బంటుమిల్లి-1 ఎంపీటీసీ సభ్యుడు కమాల్ బాషా గత ప్రభుత్వం జగనన్న కాలనీలో రూ.కోటితో చేపట్టిన మెరక పనులపై ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం కాలనీల అభివృద్ధికి ఏమి చర్యలు తీసుకుంటోందని అడిగారు. గతంలో జరిగిన పనులకు బిల్లులు రాలేదని, ప్రస్తుత ప్రభుత్వం కాలనీల అభివృద్ధిపై ఎటువంటి ఆదేశాలూ ఇవ్వలేదని ఏఈ బదులిచ్చారు. ఎంఈఓ బి.త్రిపురసుందరీదేవీ తమ శాఖపై నివేదిక ఇవ్వగా.. బంటుమిల్లి ఉన్నత పాఠశాలలో వాచ్‌మన్ ఉండగా దాదాపు రూ.లక్షకు పైగా విలువైన డిజిటల్ టీవీని దుండగులు పగులకొట్టారని, దానిపై ఏమి చర్యలు తీసుకున్నారని కమాల్ బాష ప్రశ్నించారు. ఎంఈఓ వివరణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేశ్వరరావు తమ శాఖ నివేదిక ఇవ్వగా.. బంటుమిల్లిలో కలుషితమైన తాగునీరు సరఫరా అవుతోందని, ఫిల్టర్ల మరమ్మతులు చేసినా తాగునీరు ఎందుకు రావడం లేదని కమాల్, కోఆప్షన్ సభ్యుడు ఆలీం ప్రశ్నించారు. ఇది పచాయతీ పరిధిలోదని, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని ఏఈ వివరణ ఇచ్చారు. అనంతరం వ్యవశాయ శాఖ ఏఓ శివరామకృష్ణ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ సైదారావు, ఎలక్ట్రికల్ ఏఈ రవికుమార్ తమ శాఖల నివేదికలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఒడిమే చిన్నారిబాబు, కొల్లా లలిత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.వెంకటరమణ, తహసీల్దార్ భరత్ రెడ్డి, ఎంపీడీఓ జె.స్వర్ణభారతి, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ డి.ఆర్.కె.శర్మఎంపీటీసీ సభ్యులు పి. వీరబాబు, లక్ష్మి, కనకదుర్గ, రోహిణి, భగవంతం పలు గ్రామాల సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో హామీల అమలు

ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, పక్కన వేదవ్యాస్

పెడన: ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రాధాన్యతా క్రమంలో తప్పకుండా అమలు చేస్తామని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. నడుపూరు గ్రామంలో మంగళవారం జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.11 లక్షలతో నిర్మించే రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వంద రోజులు పూర్తయిన సందర్భంగా మొట్టమొదటిగా ఇచ్చిన హామీ పింఛన్లు పెంపును అమలు చేసి చూపామన్నారు. ఈ కార్యక్రమంలో శాసన సభ మాజీ డెప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, జెడ్పీటీసీ అర్జా వెంకటనగేష్, టీడీపీ మండల అధ్యక్షుడు శెలపాటి ప్రసాద్, కిషన్ తేజా, సర్పంచ్ అనూష, ఎంపీడీఓ రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు. నేలకొండపల్లిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు మొక్కలను నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

ప్రజలకు చిత్తశుద్ధితో సేవలందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గరుడప్రసాద్

కృత్తివెన్ను: ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు సైతం చిత్తశుద్ధితో ప్రజలకు సేవలందించాలని ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. వివిధ శాఖల అధికారులు తమ శాఖ నివేదికలను ప్రవేశపెట్టారు. తాగు, సాగునీటిపై పలువురు సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నించగా అధికారులు సమాధానాలు ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలలో గత ప్రభుత్వ హయాంలో అందించిన విధంగానే మెనూ అమలవుతోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామలగౌరీ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని, అధికారులు ముందుస్తు సమాచారం ఇవ్వకుండా తనిఖీ చేస్తేనే వాస్తవాలు వెలుగుచూస్తాయని పలువురు ఎంపీటీసీ సభ్యులు పేర్కొన్నారు. ఇకపై ఆకస్మికంగా తనిఖీలు చేయాలని సూపర్‌వైజర్‌కు ఎంపీపీ సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు రత్నకుమారి, వైఎస్ ఎంపీపీలు సత్యనారాయణ, శిరీష, తహసీల్దార్ సోమేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మధుసూదనరావు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

18 మంది వీఆర్వోలు బదిలీ

పెడన: మండలంలో పనిచేస్తున్న 18 మంది వీఆర్వోలు బదిలీ అయ్యారని ఇన్‌చార్జి తహసీల్దార్ అనీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల వారీగా బల్లిపర్రు నుంచి కె.ఆర్.గణేష్‌రావు, పెనుబల్లి నుంచి గోవిందరాజులు, నడుపూరు నుంచి వీరభద్రరావు, నందమూరు నుంచి కిషోర్‌బాబు, కాకర్లమూడి వీరబాబు, చేవేంద్ర నుంచి యోధ, చెన్నూరు నుంచి భారతి, మడక నుంచి స్టాలిన్, కమలాపురం నుంచి అంకాలరావు, నందిగామ నుంచి శివపార్వతి, పెడన ఐదో సచివాలయం నుంచి సీహెచ్.శ్రీనివాసరావు, నాలుగో సచివాలయం నుంచి షాకీరుల్లా, మూడో సచివాలయం నుంచి మాలతీసాయిదుర్గ, తొమ్మిదో సచివాలయం నుంచి టి.కె.వి.ప్రసాద్, ఎనిమిదో సచివాలయం నుంచి శివనాగ సత్యనారాయణ, ఏడో సచివాలయం నుంచి రత్నకుమారి, రెండో సచివాలయం నుంచి కనకదుర్గ బదిలీ అయ్యారు. బల్లిపర్రుకు టి.కె.వి.ప్రసాదు, పెనుమల్లికి సీహెచ్.ఎస్.ఎల్.ఆర్.మూర్తి, నడుపూరుకు ఏసుపాదం, నందమూరుకు ఎస్.రహీం, ఉరివికి వీరబాబు, చెన్నూరుకు యోధ, చేవేంద్రకు బి.నాగరాజు, మడక పి.శ్రావణిరమ్య, కమలాపురానికి పి. శివనాగ సత్యనారాయణ, నందిగామకు ఎల్.గణేష్, పుల్లపాడుకు శివపార్వతి, పట్టణంలోని ఐదో సచివాలయానికి రత్నకుమార్, ఒకటో సచివాలయానికి వీరభద్రరావు, మూడో సచివాలయానికి మధుశేఖర్, రెండో సచివాలయానికి మాలతీసాయిదుర్గ, బ్రహ్మపురానికి ఎం.శ్రీనివాసరావు, ఎనిమిదో సచివాలయానికి ఎం.శివనాగమణికంఠ, ఏడో సచివాలయానికి నాగాంజనేయులు, నాలుగో సచివాలయానికి కనకదుర్గ వీర్వోలుగా బదిలీపై వచ్చారు.

పలువురు వీఆర్వోలకు స్థానచలనం

గూడూరు: మండలంలోని పలువురు వీఆర్వోలకు స్థానచలనం కలిగింది. పోసినవారిపాలెం వీఆర్వో కె.అర్జునరావును కంచాకోడూరుకు బదిలీ అవగా, ఆ స్థానంలో మచిలీపట్నం సౌత్ మండలం రాజుపేట వీఆర్వో దేవరకొండ దివ్యశ్రీ లక్ష్మి నియమితులయ్యారు. కంచాకోడూరు వీఆర్వో కె.బాజీరావు గన్నవరం మండలానికి బదిలీ అయ్యారు. తరకటూరు వీఆర్వో కె.కోటేశ్వరరావును పోలవరం బదిలీ అవగా, అక్కడి వీఆర్వో కుందేటి ఉషారాణి పామర్రు మండలం, ముక్కొల్లు వీఆర్వో మహ్మద్ బషీర్ కంకటావకు, అక్కడి వీఆర్వో ఎన్.వెంకటేశ్వరరావు లేళ్లగరువుకు బదిలీ అయ్యారు. ఐదుగుళ్లపల్లి వీఆర్వో గుడివాడ వెంకట సుబ్బారావును మచిలీపట్నం మండలం గిలకలదిండికి బదిలీ చేయగా ఆయన స్థానంలో కప్పలదొడ్డి నుంచి అడపా నరేష్‌ను నియమించారు. పెడన మండలం బల్లిపర్రు వీఆర్వో రుద్ర జ్ఞానేశ్వరరావు కప్పలదొడ్డి వీఆర్వో, మచిలీపట్నం సౌత్ మండలం రాజుపేట వీఆర్వో వాకా శివగణపతి మల్లవోలు-1 వీఆర్వో, నందివాడ మండలం పోలుకొండ వీఆర్వో పి.నెలబాలుడు ముక్కొల్లు, రాయవరం వీఆర్వో కె.కల్యాణి బందరు సౌత్ మండలం ఉల్లింగిపాలెం బదిలీ అయ్యారు. కల్యాణి స్థానంలో పెడన మండలం కమలాపురం వీఆర్వో ఆత్మూరి అంకాలరావును నియమించారు. బందరు నార్త్ మండలం నారాయణపురం వీఆర్వో గూడవల్లి శ్రీకాంత్ రామరాజుపాలెం, అక్కడ పనిచేస్తున్న కె.వెంకటేశ్వరరావును పామర్రు మండలానికి బదిలీ చేశారు.

పోలీసులపై దాడి దారుణం

చల్లపల్లి(అవనిగడ్డ): అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునేందుకు వెళ్లిన పోలీసులపై అక్రమార్కులు దాడి చేయడం దారుణమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ పేర్కొన్నారు. నిందుతు లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిమ్మగడ్డ రేవు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకున్నందుకు రెవెన్యూ, పోలీసు సిబ్బందిపై దాడులకు పాల్పడం మంచిది కాదన్నారు. వాల్టా చట్టాన్ని అమలు చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులపై దాడులకు దిగేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమవేశంలో సీపీఐ నాయకులు పెనుమత్స రాజారత్నం, నాగమల్లి సిద్దాబత్తుల వాసు పాల్గొన్నారు.

ఎదురుమొండి - గొల్లమంద రోడ్డుకు ప్రాధాన్యం ఇవ్వండి



డెప్యూటీ సీఎం పవన్‌కల్యాన్‌తో చర్చిస్తున్నకలెక్టర్

చిలకలపూడి(మచిలీపట్నం): అవనిగడ్డ నియోజకవర్గంలోని ఎదురుమొండి - గొల్లమంద రహదారి నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ డి.కె.బాలాజీ కోరారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం రాత్రి మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో రహదారి నిర్మాణం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. ఇటీవల వచ్చిన వరదలకు ఈ రోడ్డు 700 మీటర్ల మేర కోతకు గురైందని, పునర్నిర్మాణానికి రూ.13.45 కోట్లతో అంచనాలు రూపొందించామని తెలిపారు. డెప్యూటీ సీఎం స్పందిస్తూ ఈ రోడ్డు పునర్నిర్మాణాన్ని ప్రాధాన్యతా అంశంగా తీసుకోవాలని, సవరించిన అంచనాలతో సత్వరం నివేదిక పంపాలని ఆదేశించారు. ఈ వ్యయాన్ని ఏఐబీ గ్రాంట్ నుంచి తీసుకోవాలని పీఆర్ ఈఎన్‌సీ బాలునాయక్‌కు సూచించారు. ఏటిమొగ, ఎదురుమొండి దీవుల్లోని ఇతర పల్లెలకు వెళ్లే ప్రజల రాకపోకల కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో పంట్లు సమకూర్చుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న పంట్ల సామర్థ్యం, భద్రతపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

పార్లమెంట్ సదస్సులో బుద్ధప్రసాద్



అవనిగడ్డ: వికసిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటించిన విజన్ 2047 కార్యాచరణ ఎంతగానో దోహద పడుతుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. భారత పార్లమెంట్‌లో బాధ్యతాయుతమైన శాసన వ్యవస్థ, శాసనసభ పాత్ర - నాయకుల దార్శనికత అనే అంశంపై మంగళవారం ప్రత్యేక సదస్సు జరిగింది. ఆంధ్రప్రదేశ్ తరపున శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పాల్గొన్నారు.

నీరుగారుతున్న పొలం పిలుస్తోంది



పంచాయతీ కార్యాలయంలో 'పొలం పిలుస్తోంది'లో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

కోడూరు: 'పొలం పిలుస్తోంది' కార్యక్రమ లక్ష్యాన్ని వ్యవసాయ అధికారులు నీరుగారుస్తున్నారు. పంట సాగులో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేందుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి నిర్వహిస్తోంది. అయితే ఈ కార్యక్రమ విధివిధానాలను మండల వ్యవసాయ అధికారులు పూర్తిగా విస్మరించి, తమ ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మంగళవారం కోడూరు వ్యవసాయ అధికారులు కార్యక్రమం నిర్వహించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గ్రామంలోని ఓ రైతు పొలం వద్ద నిర్వహించాల్సి ఉండగా, అధికారులు మాత్రం పంచాయతీ కార్యాలయంలో జరిపించారు. కార్యక్రమం గురించి రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాల్సి ఉండగా, ఆ విధంగా అధికారులు చర్యలు తీసుకోలేదు. కార్యాలయంలో మొక్కుబడిగా ఫ్లెక్సీ కట్టి తూతూమంత్రంగా కార్యక్రమాన్ని జరిపారు. ఈ సమావేశంలో ఒక్క రైతు కూడా లేకపోవడం గమనార్హం. ఏఓ శ్రీధర్ సమావేశానికి రైతులను పిలవకుండా కూటమి నేతలను పిలిచి వారి మెప్పు పొందే ప్రయత్నం చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. వేదికపైన, వేదిక ముందు కూటమి నేతలే ఉండడం, వారికే వ్యవసాయ అధికారులు సలహాలు ఇవ్వడం కొసమెరుపు.

వ్యవసాయ అధికారుల తీరుపై సర్పంచి ఆగ్రహం

పంచాయతీ కార్యాలయంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించడంపై కోడూరు సర్పంచి వెన్నా షైనీ మండిపడ్డారు. కార్యక్రమాన్ని పంట పొలం వద్ద నిర్వహించకుండా కార్యాలయం ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమానికి రైతులను పిలవకుండా తమ ఇష్టానుసారంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. మండల వ్యవసాయ అధికారుల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు సర్పంచి షైనీ తెలిపారు.

ఘంటసాల ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

ఘంటసాల: ఘంటసాల ఎంపీడీఓగా దేవరెడ్డి సుబ్బారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఏఓ కె.జె.శ్రీనివాసచంద్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు మర్యాద పూర్వకంగా కలసి సుబ్బారావును అభినందించారు. ఎంపీడీఓను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వేమూరి వెంకట్రావు, సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్ మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు. కొడాలి గ్రామానికి చెందిన మండల టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు కూడా ఎంపీడీఓను మర్యాద పూర్వకంగా కలిశారు. మండలాన్ని ఆదర్శవంతగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజా ప్రతినిధులు, అధికార, ప్రతిపక్ష పార్టీలు, అధికారులను సమన్వయం చేసుకుంటూ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు జరిగేలా చూస్తానని ఎంపీడీఓ సుబ్బారావు తెలిపారు.

చేపల సాగుకు కేసీసీ గోల్డ్ లోన్ ప్లస్



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్ఎం సాయిరామ్

నాగాయలంక: ఇండియన్ బ్యాంకు ప్రాయోజితమైన సప్తగిరి గ్రామీణ బ్యాంకు ద్వారా అన్ని రంగాలకు విస్తృత బ్యాంకింగ్ సేవలు అందించే లక్ష్యంగా చేపల సాగు, ఇతర వ్యవసాయ అవసరాల కోసం కేవలం ఏడు శాతం వడ్డీతో కేసీసీ గోల్డ్ లోన్ ప్లస్ కింద రుణాలు ఇస్తున్నామని బ్యాంకు గుడివాడ రీజనల్ మేనేజర్ మోదుమూడి సాయిరామ్ తెలిపారు. ఇటీ వల ఆర్ఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం నాగాయలంక బ్యాంక్ బ్రాంచ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. సకాలంలో రుణ చెల్లింపు కింద ఇచ్చే మూడు శాతం పరిగణిస్తే కేసీసీ లోన్‌పై వడ్డీ కేవలం నాలుగు శాతం కిందికే వస్తుందన్నారు. ఎస్‌జీహెచ్ (డ్వాక్రా)తో పాటు పంట రుణాలు, చేపల సాగు, మామిడి, ఇతర ఉద్యాన పంటలు, గృహనిర్మాణం, వాణిజ్యం, అపార్ట్‌మెంట్ల నిర్మాణం, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు తాము రుణాలు ఇస్తున్నామని పేర్కొన్నారు. సప్తగిరి బ్యాంకు ద్వారా 60 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్ ఖాతాదారులకు అధిక వడ్డీ ఇస్తున్నామని వివరించారు. భారత ప్రభుత్వం 50 శాతం, ఇండియన్ బ్యాంకు 35 శాతం వాటాలతో ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా ప్రాధాన్యతా రంగాలకు పెద్దపీట వేస్తున్నామని వివరించారు. బ్రాంచి మేనేజర్ బి.జె.విఠల్ విహారి, క్యాషియర్ నాగలక్ష్మి, గోల్డ్ అప్రైజర్ లేబాక నాగేశ్వరరావు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

కృత్తివెన్ను: ప్రభుత్వ ఆస్తులను ఆర్థిక వనరులుగా మార్చి ఎంతో కొంత లాభసాటిగా చేయాలన్న లక్ష్యంతోనే మండల పరిషత్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేశామని కృత్తివెన్ను ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుటి భాగంగా నిర్మించిన షాపులను ఆయన జెడ్పీటీసీ సభ్యురాలు మైల రత్నకుమారితో కలసి మంగళవారం ప్రారంభించారు. రూ.12 లక్షల మండల పరిషత్ 15 ఆర్థిక సంఘ నిధుల నుంచి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించామని ఎంపీపీ తెలిపారు. త్వరలో షాపులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం అద్దెకు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, శిరీష, పంచాయతీ రాజ్ ఏఈఈ నగేష్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.